క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణభారతినగ్ 4వ లైనుకు చెందిన చిత్రాల శ్రీనివాసరావు డ్రైవర్‌గా పనిచేసుకుని జీవిస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పనిమీద ద్విచక్రవాహనంపై అడవితక్కెళ్లపాడు నుంచి తిరిగి వస్తుండగా దారి మధ్యలో కుక్క అడ్డువచ్చి సడన్ బ్రేక్ వేయటంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు అవ్వటంతో స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

10న యూటీఎఫ్ మీటింగ్ హాల్ ప్రారంభోత్సవం



చేబ్రోలు: యూటీఎఫ్ చేబ్రోలు మండలం కార్యాలయంపైన కొత్తగా నిర్మించిన కామ్రేడ్ కృష్ణ స్వరూప్ మీటింగ్ హాలును ఈ నెల 10న ప్రారంభించనున్నట్లు యూటీఎఫ్ నాయకులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికలను నాయకులు ఆవిష్కరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, దీప్తి పబ్లికేషన్స్ అధినేత అడ్డాల ఆంజనేయులు, యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు, స్థానిక నాయకులు పాల్గొంటారని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వై.రమేష్‌బాబు, డి.నాగేశ్వరరావు తెలిపారు.

పెదకాకానిలో నడిరోడ్డుపైనే బురదనీరు



పెదకాకాని: రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యిలో వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పెదకాకాని శివాలయం ఎదురు రోడ్డులో ఏర్పడిన గొయ్యిలో తరచూ వర్షపునీరు చేరి బురదమయంగా మారుతోంది. అలానే ఆ రోడ్డులో సైడు కాలువలూ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. ఈ మార్గం గుంటూరు గోళ్ళమూడి గ్రామానికి వెళ్ళే ప్రజలు, రైతులు, ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోళ్ళమూడి వెళ్ళే రోడ్డులో నడిరోడ్డుపై ఏర్పడిన గోతులను పూడ్చాలని, వర్షపునీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తికి గాయాలు



చేబ్రోలు: ప్రమాదవశాత్తూ గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు వద్ద బుధవారం రాత్రి జరిగింది. నారాకోడూరు – బుడంపాడు గ్రామాల మధ్య ఉన్న రుచి టీ స్టాల్ ఎదురుగా జీబీసీ రహదారిపై రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని వేగంగా వెళ్తున్న గుర్తు తెలియని బైక్ ఢీ కొట్టింది. ఘటనలో తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విదేశ వర్సిటీల్లో ఉన్నత ఫార్మసీ విద్య

గుంటూరు ఎడ్యుకేషన్: విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఔషధ రంగంలో ఉన్నత విద్యతో పాటు ఉద్యోగావకాశాల్ని అందిపుచ్చుకోవాలని హన్మకొండకు చెందిన క్రిస్టల్ ఓవర్సీస్ కన్సల్టెంట్ సీఈవో డాక్టర్ ఏ.మహేష్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం 'ఫార్మసీ రంగంలో ఉన్నత విద్య–ఉపాధి అవకాశాలు'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహేష్ మాట్లాడుతూ బీఫార్మసీ, ఫార్మాడీ విద్యార్థులకు అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఐర్లాండ్ దేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు అందుబాటులో గల కోర్సుల్ని తెలిపారు. అడ్మిషన్ పొందేందుకు కావాల్సిన అర్హతలు, వివిధ వర్సిటీల్లో విద్యార్థులకు అందించనున్న ఉపకార వేతనాలు గురించి వివరించారు. బీఫార్మసీ, ఫార్మాడీ అనంతరం దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాల గురించి హైదరాబాదులోని క్లిన్‌ఫార్మెడ్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వి. మహేష్ వివరించారు.

తనిఖీలెక్కడ!



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

ప్రత్తిపాడు: పౌర సరఫరాల శాఖ అధికారులు తనిఖీలను పూర్తిగా విస్మరించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు అందాల్సిన సరుకులు పక్కదారి పట్టకుండా, సకాలంలో సజావుగా లబ్ధిదారులకు అందించేలా చూడాల్సిన సంబంధిత శాఖ అధికారులు తనిఖీల ఊసే ఎత్తడం లేదు. ఫలితంగా ఎండీయూ ఆపరేటర్లు బియ్యం పంపిణీ ఎప్పుడు చేస్తున్నారో.. ఎక్కడ చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి క్షేత్రస్థాయిలో చోటుచేసుకుంటుంది.

- తనిఖీలను గాలికొదిలేసిన సివిల్ సప్లయీస్ అధికారులు
- ప్రతి నెలా వంద శాతం తనిఖీలు ఒట్టిమాటే
- నల్లబజారుకు తరలుతున్న రేషన్ బియ్యం

ఇంటింటికి మంగళం

ప్రత్తిపాడు మండలంలో మొత్తం 38 రేషన్ దుకాణాలు, 10 ఎండీయూ వాహనాలున్నాయి. ఈ వాహనాల ద్వారా 15,825 మంది కార్డుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. కానీ ఒక్క వాహన సిబ్బంది కూడా ఇంటి వద్దకు వెళ్లి బియ్యం ఇవ్వడం లేదు. ఏదో ఒక బజారులో ఎక్కడో ఒక చోట వాహనాన్ని నిలిపి పంపిణీ చేస్తున్నారు. దీంతో ఆయా వాహనాల పరిధిలో ఉన్న కార్డుదారులు ఎక్కడ ఏ గల్లీలో వాహనం ఉందో అని వీధి వీధి వెతుక్కుంటూ తిరగాల్సిన పరిస్థితి గ్రామాల్లో కనిపిస్తుంది.

ఎవరో ఒకరు వచ్చి పట్టుకోవడమే..

గడిచిన ఏడాదిన్నర కాలంలో మండలంలో పలు అక్రమ రేషన్ బియ్యం కేసులు నమోదయ్యాయి. వీటిలో ఒక్కటంటే ఒక్కటి కూడా సొంతంగా సివిల్ సప్లయీస్ అధికారులు పట్టుకున్న దాఖలాలు లేవు. పోలీసులో లేక విజిలెన్స్ అధికారులో దాడులు చేయడం, లేదా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతోనో దాడులకు వెళ్లడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తనిఖీలు సజావుగా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు నిల్

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సక్రమంగా సరుకులు పంపిణీ అయ్యేలా చూడాల్సిన పూర్తి బాధ్యత మండల స్థాయిలో సీఎస్ డీటీపై ఉంటుంది. కానీ డీటీ తనిఖీలను పూర్తిగా విస్మరించారు. ప్రతి నెలా తమ పరిధిలో ఉన్న అన్ని వాహనాల ద్వారా జరుగుతున్న రేషన్ పంపిణీని, రేషన్ షాపుల్లోని రిజిస్టర్లు, స్టాక్‌లను క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేసి, ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించాల్సి ఉంది. కానీ ప్రత్తిపాడు మండలంలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. సీఎస్ డీటీ నెలలో వంద శాతం తనిఖీలు చేసిన దాఖలాలు లేవన్న వాదనలు వినిపిస్తున్నాయి. కానీ నివేదికల్లో మాత్రం వాస్తవ విరుద్ధంగా అంకెలుంటాయని సమాచారం. జిల్లా ఉన్నతాధికారులో లేక ఇతర ఉన్నతాధికారులు ఫీల్డ్ విజిట్‌కి వచ్చినప్పుడు మినహా సీఎస్ డీటీ క్షేత్ర స్థాయిలో కనిపించిన దాఖలాలు వేళ్ల మీద లెక్కించవచ్చు. ఫలితంగా గుట్టుచప్పుడు కాకుండా తెల్ల బియ్యం నల్లబజారుకు తరలి పోతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ మధ్య కాలంలో రాలేదు

ఈ మధ్య కాలంలో మా వాహనం వద్దకు ఎవ్వరూ తనిఖీలకు రాలేదు. కొద్ది రోజుల కిందట మాత్రం తహసీల్దార్ కార్యాలయంలో మా అందరితో మీటింగ్ పెట్టారు సీఎస్ డీటీ. అంతే.

–ఒక ఎం డీయూ ఆపరేటర్

వంద శాతం తనిఖీలు చేయాల్సిందే

ప్రతి సీఎస్ డీటీ తమ పరిధిలో ఉన్న అన్ని ఎండీయూ వాహనాల ద్వారా జరిగే రేషన్ పంపిణీని వందకు వంద శాతం తనిఖీలు చెయ్యవలసిందే. ఇందులో ఎలాంటి మార్పులు లేవు. కచ్చితంగా తనిఖీలు చేసేలా, సీఎస్ డీటీ అందుబాటులో ఉండేలా చూస్తాను.

–కోమలి పద్మావతి, జిల్లా పౌర సరఫరాల అధికారి

విద్యార్థి ఉన్నతికి కృషి చేయడమే లక్ష్యం

- కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకర్‌రెడ్డి
- బీ టెక్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకర్‌రెడ్డి

గుంటూరురూరల్: ప్రతి విద్యార్థికీ నైపుణ్యతలతో కూడిన విద్యను అందించి వారి ఉన్నతికి కృషి చేయటం తమ కళాశాల లక్ష్యమని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమాశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్స వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిపై శ్రద్ధ చూపి వారిలోని సృజనాత్మకతను వెలికి తీసి వారి లక్ష్య సాధన దిశగా తమ కళాశాల కృషి చేస్తుందన్నారు. తమ కళాశాల ఇప్పటి వరకూ పొందిన అవార్డులు ఉపాధి అవకాశాలు వివరించారు. కళాశాల చైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కళ్లం గ్రూపు సంస్థల ఆధ్వర్యంలో స్థాపించిన కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులు, విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. అత్యున్నత సాంకేతిక విద్య, ఉపాధి కల్పన ముఖ్య ధ్యేయంగా కళాశాల పనిచేస్తున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో 1200 మందికి పైగా ఇంజినీరింగ్ డిగ్రీలో ప్రవేశాలు జరిగాయన్నారు. అత్యున్నత సాంకేతిక విద్యను అందిస్తున్న ఏకైక స్వయం ప్రతిపత్తి హోదా కలిగిన కళాశాలగా ఉండటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ పి వేంకటేశ్వరరెడ్డి, ఏఓ కళ్లం నవ్య, కళాశాల ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పిఎల్ మాధవరావు, ఇంజినీరింగ్ విభాగాధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీపీ మండల్ ఆశయసాధనకు సమష్టిగా కృషిచేద్దాం

బీసీ, దళిత సంఘాల నాయకుల పిలుపు



బీపీ మండల్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న దళిత, బీసీ సంఘాల నాయకులు

గుంటూరురూరల్: బీపీ మండల్ ఆశయాల సాధన దిశగా సమష్టిగా కృషిచేద్దామని బీసీ, దళిత సంఘాలు పిలుపునిచ్చాయి. అమరావతిరోడ్డులోని ఇన్నర్‌రింగ్‌రోడ్డులో ఉన్న బీపీ మండల్ విగ్రహం వద్ద బుధవారం బీసీ రిజర్వేషన్ల సాధన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీపీ మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ప్రధాని వీపీ సింగ్ నేతృత్వంలో పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్లపై బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంగా ఈ వేడుకలు జరపటం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వైకే మాట్లాడుతూ రాజ్యాధికారం దిశగా బలహీనవర్గాలు పోరాటం చేయాలని, సమాజంలో అణగారిన వర్గాలకు న్యాయం జరగాలంటే సమష్టిగా కృషిచేయాలన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కావాలని బీపీ మండల్ కృషి చేస్తున్న సమయంలో ఎల్‌కే అద్వానీ దానిని వ్యతిరేకిస్తూ మందిర్ యాత్ర చేపట్టారని ఆరోపించారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దళిత, బీసీ నాయకులు భగత్‌సింగ్, సుబ్రహ్మణ్యం, నీలాంబరంలు మాట్లాడుతూ సామాజికపరంగా వెనుకబడిన వారిని ఒకతాటి మీదకు తీసుకొచ్చి రిజర్వేషన్లను సాధించి పెట్టిన ఘనత బీపీ మండల్‌కి దక్కుతుందన్నారు. 340 ఆర్టికల్, బీపీ మండల్ కృషి కారణంగానే బీసీలకు 27 శాతం రిజర్వేషన్‌లు అమలవుతున్నాయన్నారు. రిజర్వేషన్ల అమలులో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నందున వెనుకబడిన వర్గాలు సమష్టిగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు సాధం సత్యనారాయణ, తుమ్మేటి కృష్ణ, కె సుబ్రమణ్యం, తన్నీరు సాంబయ్య, దేవరాజ్, పోతురాజు, తిరుపతిరావు తదితరులున్నారు.

రేపు జిల్లావ్యాప్తంగా 'క్విట్ కార్పొరేట్' డే

వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపు



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు

లక్ష్మీపురం: క్విట్ ఇండియా డే సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈనెల 9న క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ కార్మిక రైతు సంఘ కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున రైతాంగం సంవత్సరం పాటు ఢిల్లీలో ఆందోళన నిర్వహించారన్నారు. రైతుల సమస్యల్ని పరిష్కరిస్తామని, పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీ అమలు చేయకుండా మోసం చేశారని తీవ్రంగా విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించారని తెలిపారు. ఎరువుల సబ్సిడీలు తగ్గించారని, క్రిమిసంహారక మందుల అమ్మకంలో వ్యాపారస్తులకు అనుకూలమైన విధానం రూపొందించారని తెలిపారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి ఉపాధి కూలీల పొట్ట కొట్టారని ఆరోపించారు. ఆహార భద్రత విషయంలో కూడా బడ్జెట్లో నిధులు తగ్గించారని తెలిపారు. ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి శివాజీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదానీ,అంబానీల కోసం పని చేస్తోందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి ఇండియా డే సందర్భంగా ఆగస్టు 9వ తేదీన క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చిందని వివరించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరిగాని శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా నాయకులు కొల్లి రంగారెడ్డి పాల్గొన్నారు.

డీఆర్‌ఎం కార్యాలయంలో లిఫ్ట్‌లు ప్రారంభం



లక్ష్మీపురం: పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో రెండు నూతన లిఫ్ట్‌లను డీఆర్‌ఎం రామకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాత లిఫ్ట్‌లు మరమ్మతుల దృష్ట్యా కొత్త వాటిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని సమస్యల్ని ప్రయాణికులు తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్లలో పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. అనంతరం లిఫ్ట్ పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కె.సైమన్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ డి.మనోహర్‌రెడ్డి, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ జి.సూర్యనారాయణ, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసే ఉద్యోగుల సేవలు శాశ్వతం

సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధునరసింహారెడ్డి



లక్ష్మీపురం: ఉద్యోగులు ఎన్ని ప్రాంతాలు మారినా, వారు అందించిన సేవలు మాత్రం శాశ్వతంగా నిలిచిపోతాయని సెంట్రల్ సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధునరసింహారెడ్డి అన్నారు. కన్నావారితోటలోని జీఎస్టీ భవన్‌లో ఒకేసారి ఇద్దరు ఐఆర్‌ఎస్ ఉన్నతాధికారులు బదిలీ సందర్భంగా బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రామకృష్ణరాజు యాదవ్, ఉపేంద్రకుమార్ ధృవ్ నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు, ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచటానికి ఎంతో కృషిచేశారని, వారి సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. రామకృష్ణరాజు యాదవ్, ఉపేంద్రకుమార్ ధృవ్ మాట్లాడుతూ కమిషనర్ సూచనలతోనే తాము ఉత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు. విధి నిర్వహణలో ఆయన నుంచి అనేక విషయాలు నేర్చుకున్నట్లు చెప్పారు. ఇద్దరు ఉన్నతాధికారుల్ని కమిషనర్, ఉద్యోగులు సన్మానించారు.

ఆకట్టుకున్న చేనేత ప్రదర్శన



గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వస్త్ర ప్రదర్శన నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి ఆధ్వర్యంలో పెడన చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చేనేత కార్మికుల్లో కళా నైపుణాన్ని ప్రోత్సహించాలని కోరారు. చేనేత వస్త్రాల ప్రాధాన్యత గురించి తెలియజేయడానికి విద్యార్థినులతో రీల్స్ చేయిస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల జీవితాలను ప్రతిబింబించే విధంగా విద్యార్థినులకు పోటీల్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రదర్శనలో రూ. లక్ష విలువలైన వస్త్రాలు అమ్మకాలు జరిగినట్లు పేర్కొన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు చేనేత వస్త్రాల్నిధరించి ఆకట్టుకున్నారు.

విద్యార్థుల ఉజ్వల భవితే మా లక్ష్యం

- కిట్స్ అక్షర్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు
- అట్టహాసంగా బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రామ్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

ప్రత్తిపాడు: విద్యార్థుల ఉజ్వల భవితే మా లక్ష్యమని కిట్స్ అక్షర్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని కిట్స్ అక్షర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 2024 ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ మాపై నమ్మకంతో కౌన్సెలింగ్‌లో మా కళాశాలను ఎంచుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. యూనివర్సిటీ సిలబస్‌తో పాటు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్, ఇండస్ట్రియల్ శిక్షణలో కూడా పాల్గొని నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. గత సంవత్సరం తమ కళాశాలలోని విద్యార్థులకు ప్రముఖ ఎంఎన్‌సి కంపెనీల్లో మంచి ఉద్యోగ అవకాశాలు లభించాయని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకోటయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ఇంజినీరింగ్ విద్యలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. మంచి ప్రణాళికతో విద్యార్థి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను తెలుసుకుని అకడమిక్ క్యాలెండర్‌ని తయారుచేసి ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందిస్తామన్నారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి క్రమశిక్షణతో మెలగాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తామని తెలిపారు. డైరెక్టర్ గోగినేని సాంబశివరావు మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

- ఐఐటీ ఖరగ్‌పూర్ విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ సాంబశివరావు
- చలపతిలో బీటెక్ తరగతుల ప్రారంభ వేడుకలు



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరురూరల్: విద్యార్థి దశలోనే విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన దిశగా కృషి చేయాలని ఐఐటీ ఖరగ్‌పూర్ విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ సాంబశివరావు అన్నారు. నగర శివారులోని లాంలో ఉన్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల చదువులో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమైందన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుని, ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో తమ కళాశాలను ఎంచుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి విద్యార్థికి ఉన్నత భవిష్యత్తును అందించేందుకు అన్ని సౌకర్యాలు తమ కళాశాలలో కల్పించామన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ వై సుజిత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి నిమిషాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని ఉన్నత ఉద్యోగాలను పొందాలన్నారు. క్రమశిక్షణతో చక్కగా చదువుకుని తల్లిదండ్రుల కలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. శాప్ యూనివర్సిటీ అలియన్స్ డైరెక్టర్ రాహుల్ సహదేవ్, మోటివేషనల్ స్పీకర్‌ఏ వీర, సుప్రజా టెక్నాలజీస్ సీఈవో సీహెచ్ సంతోష్‌లు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కొత్త టెక్నాలజీలపై పట్టు సాధిస్తేనే జీవితంలో ఉన్నత ఉద్యోగాలను పొందగలుగుతారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ కళాశాల నాక్ ఏగ్రేడ్, ఎన్‌బీఏ, అటానమస్ హోదాను కలిగి ఉందని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాల కల్పనకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. అతిథులను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమలో డీన్ డాక్టర్ జె లక్ష్మీనారాయణ, చందు రవిశంకర్, డాక్టర్ ఏ రాధాకృష్ణమూర్తి తదితరులున్నారు.

తల్లిపాలు బిడ్డకు దివ్య ఔషధం

ఎంపీహెచ్ఈవో చెల్లమ్మ



యనమదలలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

ప్రత్తిపాడు: తల్లిపాలు బిడ్డకు దివ్య ఔషధమని ఎంపీహెచ్ఈవో చెల్లమ్మ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని యనమదలలో తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రు పాలు తాగిద్దాం.. తల్లిపాలలో రోగ నిరోధక శక్తి.. అంటూ నినాదాలతో ర్యాలీ సాగింది. ఎంపీహెచ్ఈవో మాట్లాడుతూ తల్లిపాలు తాగడం ద్వారా శిశువుకు సహజమైన రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. శిశువుకు ఆరునెలల వరకు తల్లి పాలు తాగించాలని, రెండు సంవత్సరాల వరకూ ఇవ్వవచ్చని చెప్పారు. తల్లిపాలు తాగడం వలన శిశువుకు జలుబు, జ్వరం వంటివి చాలా తక్కువగా సోకుతాయని, పిల్లలకు వచ్చే లుకేమియా, షుగర్, ఆస్మా, స్థూలకాయం, మానసిక, దంత సమస్యల నివారణలో తల్లిపాల పాత్ర కీలమని వివరించారు. పీహెచ్ఎస్ నిర్మల మాట్లాడుతూ తల్లిపాలు తాగిన శిశువుల్లో యాంటీబాడీస్ వృద్ధి చెంది ఇన్‌ఫెక్షన్లు, నిమోనియా, డయేరియా వంటి వ్యాధులు సోకవని తెలిపారు.

- తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడు సెక్టార్ పరిధిలోని రామానగర్ కాలనీలో, పెదగొట్టిపాడు సెక్టార్‌లోని పాతమల్లాయపాలెం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలకు అవగాహన కల్పించారు. తల్లిపాలు ఇవ్వడం వలన బిడ్డకు కలిగే ప్రయోజనాలు, ఇవ్వకపోవడం వలన ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్.భారతి, పి.మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.జ్యోతి రాణి, యమున, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

ఆదివాసులపై దాడులు దుర్మార్గ చర్య



కరపత్రాలను ఆవిష్కరించిన సంఘాల నాయకులు

పొన్నూరు: ఛత్తీస్‌ఘడ్‌లో ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాల హత్యాకాండ అమానుషమని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ తుమాటి రాజారావు అన్నారు. పట్టణంలోని మానవ హక్కుల కార్యాలయంలో కేంద్ర, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా ఈ నెల 9, 10 తేదీలలో హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే అఖిల భారత సదస్సు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్‌లో ఆదివాసీల నివాస ప్రాంతంలో ఉన్న లక్షల కోట్ల విలువ చేసే ఖనిజ నిక్షేపాలను కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీలకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ 'కగార్' పేరుతో ఆదివాసీలపై సాయుధ బలగాలతో దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో జి.యస్. రాయల్ రాష్ట్ర నాయకులు కె.కృష్ణ, తమలపాకుల సుబ్బారావు, బలగాని వెంకటేశ్వర్లు, షేక్ సుభాని, తిరువీధుల కోటేశ్వరరావు, మన్నం కిషోర్, చలంచర్ల కిరణ్ కుమార్, స్వామి, తదితరులు ఉన్నారు.